# ఇక రోగులకు మెరుగైన సేవలు

- పూర్తయిన అదనపు పడకల భవనం పనులు
- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక కృషి
- త్వరలో ప్రారంభం కానున్న భవనం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3 : వైద్యారంగానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. ఇందులో భాగంగా కోట్లాది రూపాయల వ్యయంతో దవాఖానాల నిర్మాణంతో పాటు, కొత్తగా వైద్య కళాశాలలు, సిబ్బంది నియామకం చేపడుతోంది. నిర్మల్ జిల్లాకు కొత్తగా వైద్య కళాశాల మంజూరైంది. దీంతో జిల్లాకేంద్రానికి చుట్టుపక్కల గ్రామాలనుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అదనపు పడకల స్థాయి పెంచేందుకు నిధులు మంజూరు చేయడంతో భవనం పనులు వేగంగా జరుగుతున్నాయి.

### నిధులు కేటాయింపు..

ప్రస్తుతం ఉన్న ప్రధాన వైద్యాశాలలో అదనపు పడకలు లేకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదేగాకుండా కొత్తగా వైద్య కళాశాల మంజూరు కావడంతో దానికి అనుగుణంగా పడకల స్థాయి పెంచేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 100 పడకలు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 80 పడకలు ఉన్నాయి. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో అదనంగా 150 పడకల స్థాయికి పెంచేందుకు ప్రభుత్వం రూ. 10.30 కోట్లు నిధులు కేటాయించడంతో ప్రస్తుతం ఉన్న అంతస్తుపైన అదనపు పడకల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరుకున్నాయి. పెయింటింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. త్వరలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నది.



పూర్తయిన అదనపు పడకల భవనం పనులు

### రోగులకు మెరుగైన సేవలు అందుతాయి..

నిర్మల్ కొత్త జిల్లా అయిన తర్వాత వైద్యారంగం అభివృద్ధి చెందుతోంది. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి నిత్యం 700 నుంచి 800 వరకు రోగులు వస్తున్నారు. అయితే అదనపు పడకలు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ దవాఖానలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి. నిర్మల్‌కు కొత్తగా మెడికల్ కళాశాల మంజూరైంది. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అదనపు పడకల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందనున్నాయి.



దేవేందర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్

# వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3: వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కార్యాలయంలో వ్యాధుల నియంత్రణ, నివారణ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంక్రమిక వ్యాధుల వల్ల మరణాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మధుమేహం, రక్తపోటు, బ్రెస్ట్, ఓరల్ కేన్సర్ వంటి వ్యాధులను మొదటి దశలోనే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ తేజ్ కిరణ్‌రెడ్డి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారులు శ్రీనివాస్, నయనారెడ్డి, విమల తదితరులు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

# విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



ట్యాబ్‌లు అందుకున్న జిల్లా విద్యార్థులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లోని తొమ్మిది, పదో తరగతి 40 మంది విద్యార్థులకు పాప్ సింగర్ స్మిత స్థాపించిన అల్లై ఫౌండేషన్ ఆ ధ్వర్యంలో హైదరాబాద్‌లోని యన్ కన్వెన్షన్‌లో మంగళవారం సినీ నటుడు నాని, అడివి శేష్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్మిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల పేద విద్యార్థులు ఉంటారని, వారిని విద్యాపరంగా టెక్నాలజీ, సమాచార పరంగా ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకే ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సమన్వయ కర్తలు రాజేశ్వర్, శ్రీదేవి, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు మోహన్ రావు, శ్రీలత, సునిత, ఉమాదేవి తదితరులు ఉన్నారు.

## హామీలు అమలు చేయాలి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 3 : కేంద్రం ప్రభుత్వం రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుతామని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక జేఏసీ నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు నంది రామయ్య, ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం, కార్మిక సంఘం సంక్షోభం ఎదుర్కొవడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాంలక్ష్మణ్, లక్ష్మి, గంగన్న, గపూర్, వెంకటేశ్, గంగాధర్, పోశెట్టి, నవీన్ రావు, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

## ఆశ కార్యకర్తలు ఆందోళన చెందద్దు



మంత్రికి సమస్యను వివరిస్తున్న ఆశ కార్యకర్తలు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 3: వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న ఆశ కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇందరకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ తీసి అనంతరం మంత్రికి వినతిపత్రం అందించారు. తమకు వేతనాలు పెంచేలా చూడాలని మంత్రిని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, రాజమణి, రామలక్ష్మి, శ్యామల, సంగీత, లక్ష్మి, అనురాధ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ సభకు తరలి రావాలి

సారంగాపూర్, అక్టోబర్ 3 : నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం నిర్వహించనున్న మంత్రి కేటీఆర్ భారీ బహిరంగ సభకు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పార్టీ మండల కన్వీనర్ కొత్తపెల్లి మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల అనంతరం ఉదయం 11 గంటలకు సభ ఉంటుందని పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, వివిధ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, మండల కమిటీ, అనుబంధ కమిటీలు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, డైరెక్టర్లు, యూత్ నాయకులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

### విజయవంతం చేయాలి

సోన్, అక్టోబర్ 3 : రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నిర్మల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్మల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలను తరలించాలని సూచించారు.

## అధ్యాపకుడికి డాక్టరేట్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్రం కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న బాత్సాసే ఉమేశ్‌కు గ్లోకల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉత్తర ప్రదేశ్‌లోని గ్లోకల్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా బన్సల్ పర్యవేక్షణలో ఏ స్టడీ ఆఫ్ ఇంపాక్ట్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మెంట్ ఇన్ ఇంప్రూవింగ్ టోటల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ అనే అంశంపై పరిశోధనలకు గాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భీమారావు, అధ్యాపకులు అభినందించారు.

## యోగా పోటీలకు ఎంపిక

సోన్, అక్టోబర్ 3: మండలంలోని అభ్యాస గురుకులం పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. 8-10 ఏళ్ల విభాగంలో గంట నరేశ్, ఎస్.వర్షన్, బాలికల విభాగంలో మాధురి, 12-14 ఏళ్ల విభాగంలో ఫరహన్, కార్తికేయ, అబ్దుల్ ఫరీస్, 16 ఏళ్ల విభాగంలో ఎస్.గణేశ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను మంగళవారం పాఠశాలలో సన్మానించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు